కథ

# రాంగ్ నంబర్

గేటు తీసుకుని లోపలికి వస్తున్న ఆ నడివయసు వ్యక్తిని వెంటనే గుర్తుపట్టగలిగింది అర్చన. సంభ్రమంతోను, ఉద్విగ్నతతోను ఆమె నిటారుగా అయింది. ఆమె శరీరం సన్నగా కంపిస్తోంది.

''రెండు సంవత్సరాల క్రిందట నిర్దాక్షిణ్యంగా తమ కుటుంబంతో బంధాన్ని తెంపుకుని, తనని తరిమికొట్టిన ఆయన మళ్లీ ఇన్నాళ్ళ తరువాత తన ఇంటికెందుకొచ్చాడు?''

రాఘవయ్య మెట్లెక్కి వరండాలోకి వచ్చాడు.

''అర్చనా! బాగున్నావామ్మా?'' ఆప్యాయంగా పలకరించాడు. ఆయన్ని హఠాత్తుగా అక్కడ చూసిన షాక్ నుంచి తేరుకోలేని ఆమె, ఆయన అడిగినదానికి సమాధానం ఇవ్వలేదు.

''పాపం! మీ అమ్మ, నాన్నలు పోయారుట'' ఆమె ఇంకా అలాగే చూస్తోంది.

''బాధపడకు. ఏం చేస్తాం? ఏదీ మన చేతులలో లేదు. అయితే ఒంటరిగా వుంటున్నావన్నమాట'' ఆ స్వరంలోని సానుభూతి ఆమె గుండెని కోస్తోంది.

''జరిగినదానికి శ్యామ్ కూడా చాలా బాధపడుతున్నాడమ్మా!'' 'శ్యామ్!' ఆ పేరు వినగానే ఆమె శరీరంలోని రక్తమంతా వడివడిగా పరుగులు తియ్యడం మొదలుపెట్టింది. ఒకరకమైన ఉద్రేకంతో ఒళ్లంతా వణుకుతోంది.

రాఘవయ్య అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు. ''కాసిని మంచినీళ్లియ్యమ్మా!''

అర్చన యాంత్రికంగా వంటగదిలోకి వెళ్లి మంచినీళ్ళు తెచ్చి ఆయనకి అందించింది. ఆమె మనసు కల్లోలిత సాగరంలా ఉంది. జ్ఞాపకాలు కడలి కెరటాల్లా ఉవ్వెత్తున లేస్తున్నాయి.

ఆయన మంచినీళ్ళు తాగి గ్లాసు పక్కన పెట్టి ఒక పొడి దగ్గు దగ్గి గొంతు సవరించుకున్నాడు.

''మమ్మల్ని క్షమించగలవామ్మా?''

అర్చన ఆయన తనని క్షమాపణ ఎందుకు అడుగుతున్నాడో, ఈ సంభాషణ ఎటు దారితీస్తుందో ఊహించుకుంటోంది.

''గతంలో నీపట్ల నేను, మీ అత్తగారు చాలా క్రూరంగా ప్రవర్తించాము. ఇంటి కోడలైన నిన్ను కట్నం కోసమని నిర్దాక్షిణ్యంగా కాలదన్నుకున్నాం. మీ అత్తగారు ఎంతైనా స్త్రీ కదా! ఒక్కగానొక్క కొడుకు అయిన శ్యామ్ పెళ్లి విషయంలో చాలా ఆశలు పెట్టుకుంది. ఆవిడ ఆశలని, కలలని సమూలంగా నాశనం చేసి, శ్యామ్ నిన్ను పెళ్లి చేసుకోగానే ఆవిడ తీవ్ర అసంతృప్తికి లోనయింది. ఆ అసంతృప్తితోనే ఆవిడ నీతో అలా ప్రవర్తించింది తప్ప ఆవిడ సహజంగా గయ్యాళి కాదు'' ఆయన క్షణం ఆగి అన్నాడు.

''నువ్వు సివిల్ సర్వీస్ పరీక్ష పాసయ్యావని, కలెక్టరు కాబోతున్నావని విన్నాను. నిజంగా చెబుతున్నాను. మా అబ్బాయే కలెక్టర్ కాబోతున్నంత ఆనందించాను.''

రాఘవయ్య ఇన్నాళ్ల తరువాత తనని వెదుక్కుంటూ ఎందుకు వచ్చాడా అని ఆలోచిస్తున్న ఆమెకి ఆయన రాకలోని ఆంతర్యం భోదపడింది. ఆమె పెదవులు చిత్రమైన చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

''నువ్వా ఒంటరిదానివి! నీ అక్కలంతా ఎవరి సంసారం వాళ్ళు చేసుకుంటున్నారు. వాళ్ళు నీకు జీవితాంతం ఆసరా కాలేరు కదా! కలెక్టరయినా, మినిస్టరయినా భర్త పక్కన ఉంచే సంఘంలో లభించే గౌరవం వేరు. అందుచేత నేను చెప్పేదేమిటంటే నువ్వు గతాన్ని మరచిపోయి శ్యామ్‌తో జీవితాన్ని పంచుకుంటే అందరికీ మంచిది.''

''శ్యామ్‌కి మళ్లీ కలిసి వుండడం ఇష్టమేనా?'' మొదటిసారి పెదవి విప్పిన అర్చన నిశితంగా ఆయన ముఖంలోకి చూస్తూ అడిగింది.

''నేను శ్యామ్‌తో ఆలోచించాకే నీదగ్గర ఈ ప్రస్తావన తెస్తున్నాను. నిజానికి వాడు గతంలో నిన్ను కాదన్నది కూడా మావల్లనే కదా! శనిగాడు మా నెత్తిన కూర్చుని, మా ఇంటి మహలక్ష్మిని కాలదన్నుకునేలా చేశాడు'' ఆయన స్వరంలో ధ్వనిస్తున్న పశ్చాత్తాపానికి అర్చనకి నవ్వొచ్చింది.

''నువ్వు మా ఇంటికి ఎప్పుడొస్తావమ్మా? మరచిపోయాను. నువ్వు కలెక్టర్‌వి కాబోతున్నావు కదూ! నీకు పెద్ద బంగళా, కారు అన్నీ ఇస్తారు కదూ! మాకూ శ్యామ్ ఒక్కడే కదా! మీరిద్దరూ ఎక్కడ ఉంటే మేమూ అక్కడే ఉంటాం.''

''శ్యామ్‌కి నాతో కలిసి ఉండడం నిజంగా ఇష్టమేనంటే నేనింకా నమ్మలేకపోతున్నాను'' అంది అర్చన.

''నిన్ను నమ్మించడానికి నేనేం చెయ్యాలమ్మా! నేను చచ్చినంత ఒట్టు. సరేనా! శ్యామ్ పంపితేనే నేను నీదగ్గరికి వచ్చాను. అసలు వాడే నీదగ్గరికి వచ్చి ఇదంతా నీతో మాట్లాడాలనుకున్నాడు. వెర్రి నాగన్న! మొహమాటపడ్డాడు. నీకు ఫోన్ చేసి మాట్లాడతానన్నాడు.''

''ఏం చేస్తున్నారాయన?''

''వైజాగ్‌లో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఏం చెప్పమంటావ్ వాడితో?''

''నాతో ఫోన్‌లో మాట్లాడతానన్నారుగా! ఆయనకి చెబుతానులెండి'' నవ్విందామె.

''నీనుంచి వచ్చే ఆ చల్లని కబురు కోసం మేమందరం ఎదురుచూస్తూంటాం. నా బంగారుతల్లి! మీరిద్దరూ కలిసి కాపురం చేస్తుంటే చూడాలనే ఆశని నిరాశ చెయ్యకమ్మా! వస్తానమ్మా!'' ఆయన సంతోషంతో విప్పారిన ముఖంతో మెట్లు దిగి వెళ్లిపోయాడు.

అర్చన వరండాలో స్తంభానికి ఆనుకుని అలాగే నిలబడిపోయింది.

'మీరిద్దరూ కలిసి కాపురం చేస్తుంటే చూడాలనే నా ఆశని నిరాశ చెయ్యకమ్మా' రాఘవయ్య మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

''మనవాడు కోరి జ్యేష్ఠాదేవిని వరించాడు!''

''నీ పీడ విరగడైతే తిరుపతి వెళ్లి తలనీలాలిస్తానని మొక్కుకున్నాను. నా కొడుక్కేం! కలెక్టరు. లక్షల కట్నంతో సంబంధాలు వెదుక్కుంటూ వస్తాయి'' ఒకప్పుడు అత్తగారన్న ప్రతిమాట గుర్తుకొస్తుంటే మనసుని వెయ్యి రంపాలతో కోసినట్టవుతోంది. ఎంత మరచిపోదామన్నా, మరపుకు రాని గతం ఆమె కళ్ల ముందు మెదులుతోంది.

★ ★ ★

అర్చన ఎమ్.ఏ చదువుతుండగా, ఫైనలియర్ చదువుతున్న శ్యామ్‌తో పరిచయమయింది. ఆ పరిచయం స్నేహంగా మారి దినదిన ప్రవర్థమానమై ప్రేమగా పరిణతి చెందింది. ఇద్దరి కులాలు ఒక్కటే కావడం వలన వాళ్ల ప్రేమని పెద్దవాళ్ళు అభ్యంతరపెట్టలేదు.

తన చదువు కూడా పూర్తయి ఇద్దరిలో ఏ ఒక్కరికైనా ఉద్యోగం వచ్చేవరకూ పెళ్లి చేసుకోకూడదన్న అర్చన ప్రతిపాదనని సున్నితంగా త్రోసిపుచ్చాడు శ్యామ్.

''పెళ్ళయ్యాక నువ్వు చదువుకోకూడదా! అయినా ఉద్యోగం వచ్చేవరకూ నీకు దూరంగా ఉండడం నావల్లకాదు బాబూ!'' అతని మాటలలోని అనురాగానికి, ఆర్తికి కరిగిపోయింది.

శ్యామ్ ఫైనలియర్ పరీక్షలవగానే ెళ్ల పెళ్ల ఝుంది. ఊహించినట్టుగానే శ్యామ్ యూనివర్శిటీ ఫస్టున పాసయ్యాడు.

''నేను సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేరవుతున్నాను'' అన్నాడు శ్యామ్.

''నిజమా?'' అర్చన కళ్లలో వింత వెలుగు వచ్చింది.

''ఏం? నేను సెలెక్టవనంటావా?''

''నీలాంటి బ్రిలియంట్ అనదగిన మాటకాదది. తప్పకుండా ప్రిపేరవు.'

''ఇక్కడ ఉంటే చదవలేను. అందుకే కోచింగ్ కోసం హైదరాబాద్ వెళ్లాలనుకుంటున్నాను.''

''నేను ఇక్కడే ఉండి బుద్ధిగా చదువుకుంటూ అత్తయ్యగారిని, మామయ్యగారిని జాగ్రత్తగా చూసుకుంటాను'' అంది అర్చన ఫక్కున నవ్వేస్తూ.

శ్యామ్ హైదరాబాద్ వెళ్లిపోయాడు.

అర్చన ఫైనలియర్ చదువులో నిమగ్నమయింది.

ఈమధ్యకాలంలో శ్యామ్ తల్లిదండ్రులు తనపట్ల చూపుతున్న వైఖరిలో మార్పుని ఆమె స్పష్టంగా గమనించసాగింది.

ఇదివరకు ''అమ్మా అర్చనా!'' అని ప్రేమగా పిలిచే మామగారు తనని చూస్తేనే ముఖం చిట్లిస్తున్నాడు.

''మా కోడలు బంగారుబొమ్మ!'' అని మురిసిపోయే అత్తగారు ''శ్యామ్ తెలివితేటలని చూసి, వాడు కలెక్టర్ అవుతాడని ఊహించే తన అందంతో వాడికి వలవేసింది. పిచ్చిసన్నాసి! పిల్ల ఎర్రగా, బుర్రగా ఉందని, ఆలోచించకుండా ముందుచూపు లేకుండా దీన్ని పెళ్లి చేసుకున్నాడు'' అని నిరసనగా అనడం విని నిర్ఘాంతపోయింది.

''నాంచారీ! నా ఫ్రెండ్ శేషగిరి లేడూ! వాడి కొడుకు కూడా కలెక్టరే! నిన్న బజారులో శేషగిరి కనిపించి చెప్పాడు. వేణుకి పెళ్లి నిశ్చయమయిందిట. కోటీశ్వరుల సంబంధం, ఒక్కగానొక్క కూతురుట'' రాఘవయ్య చెబుతున్నాడు.

''ఎంత అదృష్టం! మనవాడు నిర్భాగ్యుడు కాబట్టే కోరి జ్యేష్ఠాదేవిని వరించాడు'' అత్తగారి స్వరంలో వేణుకి కోటీశ్వరుల సంబంధం నిశ్చయమయిందనే అసూయకంటే తన కొడుక్కి కట్నకానుకలు ముట్టలేదనే బాధే ఎక్కువగా ధ్వనిస్తుంటే నిర్విణ్ణురాలయింది అర్చన

శ్యామ్ సివిల్ సర్వీస్ పరీక్ష పాసవడంతో ఆ బాధ రెట్టింపయింది. ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ అన్నీ బాగా చేసానే నమ్మకంతో, ఆత్మవిశ్వాసంతో వైజాగ్‌కి వచ్చాడు శ్యామ్. అప్పుడే కొడుకు కలెక్టర్ అయినట్టు మురిసిపోయారు రాఘవయ్య దంపతులు.



ఆ రాత్రి భోజనాల దగ్గర చెప్పాడు రాఘవయ్య.

''శేషగిరి అంకుల్ వాళ్లబ్బాయి వేణు పెళ్లి నిశ్చయమైందిరా! కోటీశ్వరుల సంబంధం. ఒక్కర్తే అమ్మాయి.''

''అదృష్టవంతుడు!'' ఆ క్షణంలో అతని స్వరంలో ధ్వనించినది అసూయో, అభినందనో పసిగట్టలేకపోయింది అర్చన.

''నువ్వు కలెక్టరువి కాబోతున్నావు కదురా! మీ మామ పెళ్లప్పుడు కట్నం ఇవ్వకపోతేనేం, ఇప్పుడు కనీసం నాలుగు లక్షలైనా నీకూ ఇస్తాడులే!'' రాఘవయ్య నవ్వుతూనే అన్నా ఆ మాటలలో శాసనం లాంటిదాన్ని చదవగలిగింది అర్చన. ఆమె చేతిలోని ముద్ద జారిపడింది.

''కలెక్టరు అల్లుడు ఉత్తినే వస్తాడా మరి!'' నాంచారమ్మ ఎగసన తోసింది.

''మరే! నేను అమాయకుడిని కాబట్టి తొందరపడి ఈవిడగారిని ఉత్తినే చేసుకున్నాను'' అన్నాడు శ్యామ్ నవ్వుతూ.

అర్చన దిగ్భ్రమగా చూస్తోంది. అత్తమామల మాటలని అతను ఖండించకపోవడం ఆమెకి షాకింగ్‌గా వుంది.

ఆ రాత్రి అతను ఆమెని దగ్గరికి తీసుకున్నప్పుడు అతని స్పర్శ ఆమెని కరిగించలేకపోయింది. కొన్నినెలల సుదీర్ఘమైన ఎడబాటు తరువాత కలిగిన ఆ సమాగమంలో మనస్ఫూర్తిగా ఆ సుఖాన్ని అనుభవించలేకపోయింది. ఆమె చెవులలో శ్యామ్ మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి.

''నేను అమాయకుడిని కాబట్టి తొందరపడి ఈవిడగారిని ఉత్తినే చేసుకున్నాను.''

'అతను వేళాకోళంగా ఈ మాటలని అన్నాడా? లేక కట్నకానుకలు లేకుండా తనని చేసుకున్నందుకు ఇప్పుడు బాధపడుతున్నాడా?'

మరునాడు ఏకాంతంలో ఆమె అడిగింది.

''మావాళ్లు మీకు కట్నం ఇవ్వలేదనే బాధ

హోతా పద్మినీదేవి

మీకూ ఉందా?''

''నువ్వే చెప్పు అర్చనా! మనం ఏడాది క్రిందట పెళ్లి చేసుకోకుండా ఉంటే ఇవాళ నన్ను పెళ్లి చేసుకోవడానికి నువ్వు అర్హురాలివేనా? మన కులంలో ఇవాళ నాకు వచ్చే కట్నం ఎంతో తెలుసా? నాలుగు లక్షలు. నేనింకా తక్కువే చెబుతున్నానేమో!''

అర్చన సర్పదష్టురాలిలా చూస్తోంది 'తనని పెళ్లి చేసుకున్నందుకు అతను పశ్చాత్తాపపడుతున్నాడు' ఆ భావమే మనసుని పిండేస్తోంది.

వారం రోజుల తరువాత వచ్చిన ఆమె తల్లిదండ్రుల ముఖాలు పాలిపోయి ఉన్నాయి. వాళ్లిద్దరూ హఠాత్తుగా తమ ఇంటికి ఎందుకు వచ్చారో ఊహించగలిగింది. తరువాత తల్లి అర్చన దగ్గర కన్నీళ్ళు పెట్టుకుంటూ రహస్యంగా చెప్పింది.

'కనీసం నాలుగు లక్షలైనా కట్నం ఇమ్మని, లేకపోతే అర్చనకి విడాకులిప్పించి శ్యామ్ కి వేరే పెళ్లి చేస్తానని' బెదిరిస్తూ ఉత్తరం వ్రాసాడుట రాఘవయ్య.

అర్చనకి తల తిరిగిపోసాగింది. శ్యామ్ తనపై కనబరచిన ప్రేమ తాత్కాలికమైన ఆకర్షణ అనీ, అత్తమామలు డబ్బుకోసం ఎంతకైనా తెగించగలరని, ఏదైనా చెయ్యగలరని అర్థమయిందామెకి.

''ఇప్పటికిప్పుడు నాలుగు లక్షలు తెమ్మంటే ఎలాగమ్మా! మీ నాన్నగారి తాహతు వాళ్లకి తెలియదా? అయినా మీ పెళ్లప్పుడు 'కట్నం వద్దు. మీ అమ్మాయే మాకు కట్నం' అని ఉదార్యవాదుల్లా మాట్లాడిన ఈ పెద్దమనుషులు, కొడుకు కలెక్టరు కాబోతున్నాడని ఇప్పుడు కట్నం కోసం వేధిస్తారా? నీ పెళ్లికోసం దాచిన డబ్బు లక్షరూపాయలు బ్యాంక్‌లో అలాగే ఉంది. అది మీ మామగారికిచ్చి ఎలాగో నీ కాపురాన్ని చక్కబరచాలని వచ్చాం!'' అంది ఆవిడ.

''కాని, అత్తమామలు లక్షరూపాయలతో తృప్తిపడరని అర్చనకి తెలుసు. ఆమె ఊహ చానా తప్పలేదు కూడా. అర్చన తల్లి కన్నీళ్లు కానీ, తండ్రి వేడికోలుకానీ రాఘవయ్య దంపతులని కానీ, శ్యామ్‌ని కానీ కరిగించలేకపోయాయి. అందరూ ఒకే మాటని విడివిడిగా చెప్పారు. ''నాలుగు లక్షల కట్నం లేకపోతే అర్చనకి విడాకులిస్తామని.''

అర్చన అభిమానం గాయపడింది. అంతరంగం రోషపడింది. ''నా కూతురి జీవితాన్ని నాశనం చెయ్యకు బాబూ!'' అని శ్యామ్ కాళ్లు పట్టుకుని బ్రతిమాలుతున్న తండ్రితో అంది.

''నేనేం తప్పు చేసానని వాళ్ల కాళ్లమీద పడి బ్రతిమాలుతున్నావు నాన్నా! నేను చదువుకున్నాను. నా అర్హతకి తగిన ఉద్యోగం చేస్తాను. నా కాళ్లమీద నేను నిలబడతాను'' ఆమె స్వరంలో ధ్వనించిన ఆత్మవిశ్వాసం అహంగా ధ్వనించింది నాంచారమ్మకి.

''వెళ్ళవే వెళ్ళు! నీ పీడ విరగడైతే తిరుపతి వెళ్లి తలనీలాలిస్తానని మొక్కుకున్నాను. నా కొడుక్కేం, కలెక్టర్. లక్షల కట్నంతో సంబంధాలు వెతుక్కుంటూ వస్తాయి.''

అర్చన మౌనంగా ఆ తిరస్కారాన్ని భరించి ఇంటి గడప దాటింది.

ఆమె మనసుకి తగిలిన గాయం సామాన్యమైంది కాదు. ఆ గాయం తాలూకు బాధని మరచిపోవడానికి ఆమె చదువు అనే మందుని ఎన్నుకుంది. ఆమెని గుండెల్లో పెట్టుకుని కాపాడడానికి తల్లీ తండ్రీ ఉన్నారు. అయినా ఆమె మానసికంగా ఒంటరిదయింది. ఆ ఒంటరితనాన్ని జయించే ప్రయత్నంలో మొండితనం సైడు ఎఫెక్టుగా అంటుకుంది.

దగ్గర స్నేహితులు, బంధువులు అర్చన కాపురాన్ని చక్కదిద్దే ప్రయత్నంలో శ్యామ్ తల్లిదండ్రులతో రాయబారాలు మొదలుపెట్టారు. అయితే అవి విఫలమయ్యాయి. అప్పుడే అర్చనకి శ్యామ్ సివిల్ సర్వీసెస్‌లో సెలెక్ట్ కాలేదనే విషయం తెలిసింది. దానికి కారణం అర్చన దురదృష్టమేనని నాంచారమ్మ అన్న ప్రతిమాటని యథాతథంగా రాయబారానికి వెళ్లిన మధ్యవర్తి చెబుతుంటే ఆమె రక్తం మరిగిపోయింది.

''దానిది మారెమ్మ పాదం! దరిద్రపు జాతకం! నా బిడ్డలాంటి మహామేధావి కలెక్టరు పరీక్ష సునాయాసంగా పాసై ఇంటర్వ్యూలో నెగ్గలేదంటే దానికి కారణం ఆ దరిద్రపు మొహందే! అది మళ్లీ నా ఇంట్లో అడుగుపెడితే ఇంకేం అరిష్టాలు దాపురిస్తాయో! మేము లాయర్‌తో మాట్లాడుతున్నాం. విడాకుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పండి.''

శ్యామ్ విడాకుల కోసం ప్రయత్నిస్తున్నాడని తెలిసి కూతురి కాపురం ఎప్పటికైనా చక్కబడుతుందనే ఆశతో వున్న అర్చన తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. మనోవ్యథతో మంచం పట్టిన తల్లి రెండునెలలు తిరక్కుండానే కన్నుమూసింది.

మ్యూచువల్ కన్‌సెంట్ మీద శ్యామ్, అర్చనలకి విడాకులు మంజూరయ్యాయి. శ్యామ్‌తో వైవాహిక బంధం తెగిపోయేటప్పటికే అర్చన సివిల్ సర్వీసెస్ పరీక్ష పాసయిందనే వార్త తెలిసిన వారానికే తండ్రి చనిపోయాడు.

★ ★ ★

చేదుగతం నుంచి వర్తమానానికి వచ్చిన అర్చన లెటర్ పాడ్, పెన్ తీసుకుని ఉత్తరం వ్రాయడానికి ఉపక్రమించింది.

శ్యామ్,

నిన్ను ఏమని సంబోధించాలో అర్థం కావడం లేదు. నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించాను. నీ తోడిదే జీవితమనుకున్నాను. కానీ, నువ్వు తాత్కాలికమైన ఆకర్షణనే ప్రేమ అనుకున్నావు. ఆ ఆకర్షణ తగ్గగానే నేను నీకు వెగటనిపించాను. నువ్వు నాకంటే ఉన్నత స్థాయిలోకి వెళ్ళబోతున్నావనే నమ్మకం ధీమా నీకు కలగగానే నన్ను పెళ్లి చేసుకుని నువ్వు చాలా నష్టపోయావనిపించడం కూడా బహుశా నాపై ఆకర్షణ తగ్గడానికి మరోకారణం కావచ్చు.

నీ తల్లిదండ్రులు పెద్దగా చదువుకోనివాళ్లు. కాబట్టి మన పెళ్లయిన ఏడాది తర్వాత కట్నం కోసం పట్టుబట్టారని సర్దుకున్నాను. కాని పెద్ద చదువులు చదివిన నువ్వు కూడా కట్నం కోసం పట్టుబట్టడం నాకు చాలా అసహ్యమనిపించింది.

ఇన్ని సంవత్సరాల తరువాత నీకు హఠాత్తుగా నేను గుర్తురావడం, నాతో కలిసి జీవించాలనుకోవడం చూస్తే మరింత అసహ్యమనిపించింది. ఇన్ని సంవత్సరాల కాలంలోనూ ఒక్కసారైనా నేనెలా వున్నానో తెలుసుకోవాలని ప్రయత్నించావా నువ్వు? ఇన్నాళ్ళూ గుర్తురాని నేను కలెక్టర్‌ని అయ్యానని తెలిసాక గుర్తురావడం, తెంపుకున్న బంధాన్ని పునరుద్ధరించాలనుకోవడం చిత్రంగా లేదూ! నువ్వు నాతో జీవితం పంచుకుంటానన్నా అందుకు నేను మాత్రం సిద్ధంగా లేను. నువ్వు నాకంటే చదువులో, హోదాలో తక్కువ స్థితిలో ఉండడం అందుకు కారణం కానేకాదు. ప్రేమని, పెళ్లిని డబ్బుతో కొలిచే నీలాంటి అల్పుడితో కలిసి జీవించాలనే ఊహకే నాలోని అణువణువు వ్యతిరేకిస్తోంది. నువ్వు నాకు చెయ్యగలిగిన సహాయం ఒక్కటే. దయవుంచి నన్నెప్పుడూ కలుసుకోవాలని ప్రయత్నించకు.

-అర్చన.

ఉత్తరం రాయడం పూర్తిచేసిన అర్చన కవరులో పెట్టి అతికించి పైన శ్యామ్ అడ్రస్ వ్రాసింది.

ఫోన్ మ్రోగింది. ఆ ఫోన్ కాల్ శ్యామ్‌నుంచే అని ఆమెకి తెలుసు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేసింది.

''అర్చనా!'' అవతలి స్వరాన్ని ఎన్ని యుగాలైనా మరచిపోలేదామె.

''అర్చనా! నేను శ్యామ్‌ని'' అతని స్వరంలో ఉద్విగ్నత.

''రాంగ్ నెంబర్'' ఆమె ఫోన్ పెట్టేసింది.

ఫోన్ మళ్లీ మ్రోగింది. ఆమె ఫోన్ లిఫ్ట్‌చేసే ప్రయత్నం చెయ్యలేదు. ఇంటి తలుపు తాళం పెట్టి, శ్యామ్‌కి రాసిన ఉత్తరాన్ని పోస్ట్ చేయడానికి పోస్ట్‌బాక్స్ వైపు నడిచింది.